


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 351 | కర్నూలు | గురువారం జనవరి 22 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# ఏపీలో క్లీన్ - టెక్ పెట్టుబడులకు నూతన అవకాశాలు

**భారత్ - ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి దావోస్ వేదిక**

**ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిర్ బార్కాట్‌తో సీఎం చంద్రబాబు భేటీ**



అమరావతి,జనవరి21 (శ్రీచక్ర) : భారత్ – ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి దావోస్ వేదికని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏపీలో క్లీన్ – టెక్ పెట్టుబడులకు నూతన అవకాశాలున్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం దావోస్‌లో ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిర్ బార్కాట్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇజ్రాయెల్‌తో విస్తృతంగా చర్చించామని చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. రక్షణ, ఏరోస్పేస్, యూఏవీ రంగాల్లో భారత్ – ఇజ్రాయెల్ భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే సెమీ కండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీలో సహకార అవకాశాలతో పాటు నీటి శుద్ధి, భూగర్భ జలాల నాణ్యతపై ఇజ్రాయెల్ నైపుణ్యం, వినియోగంపైనా చర్చించినట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా.. మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల రూపకల్పనపై చర్చించామని వివరించారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన సహా ఏపీని మెడ్ – టెక్, ఏరో – డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యం దిశగా అడుగులు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక తయారీకి ఇజ్రాయెల్ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రణాళికలపై సైతం ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించామని చంద్రబాబు తెలిపారు. మరోవైపు సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రేపటితో అంటే.. గురువారంతో ముగియనుంది. జనవరి 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జ్యూరిక్ ఎయిర్ పోర్ట్ నుంచి సీఎం చంద్రబాబు బృందం భారత్‌కు బయలుదేరనుంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారుల ప్రతినిధి బృందం ఆదివారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి దావోస్ బయలుదేరి వెళ్లింది. ఈ బృందానికి యూరప్‌లో ఎన్నార్టీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశమయ్యారు.అలాగే స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ సైతం సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయనతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అందుకు సంబంధించిన అంశాలను సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. అలాగే దావోస్‌లో వివిధ దేశాల మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు వరుస భేటీలతో బిజీ బిజీగా ఉంటున్నారు. మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆయనతో పలు కీలక అంశాలను చర్చించినట్లు సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వివరించిన విషయం విదితమే.

# పెట్టుబడులపై దావోస్‌లో లోకేశ్ దృష్టి

**జపాన్‌కు చెందిన జెరా సంస్థ సిఇవోతో భేటీ**

అమరావతి,జనవరి21(శ్రీచక్ర) : దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపార వేత్తలు, సీఈఓలతో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతూ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా.. జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ కోరారు. పాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు. పాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థ నిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు. పునరుత్పాదక శక్తితో పాటు ఎల్ఎన్‌జీ ఆధారిత విద్యుత్ పరివర్తన, గ్రిడ్-బ్యాలెన్సింగ్ పరిష్కారాలపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు.

# ముందుచూపుతో ప్రణాళికాబద్ధ పనితీరు

**ఆశావాద జీవితంతో అడుగులు వేస్తున్నా**

**కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతా**

**దావోస్‌లో అంతర్జాతీయ మీడియాతో చంద్రబాబు**



దావోస్,జనవరి21 (శ్రీచక్ర) భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పనిచేయడం తనకు అలవాటు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తాను ఆశావాదినని అంటూ..ముందుచూపుతో వ్యవహరించి.. వినూత్నంగా ఆలోచించి.. చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతానని ఉద్ఘాటించారు. దావోస్‌లో మూడో రోజు చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను మీడియా ప్రతినిధులకు వివరించారు. మాది పరిశ్రమల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఈజ్ ఆఫ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులిస్తున్నాం. పరిశ్రమలకు ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నాం. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నాం. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించగలిగాం. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేస్తున్నాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి. 30 ఏళ్ల కిందటే దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయి. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నాం. అవే రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయి. టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఏపీలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది నా ఆలోచన. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. ఆ స్థాయిలోనే పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోంది. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత్‌కు లేదు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారత్ అదనపు బలం' అని చంద్రబాబు అన్నారు.

# సభకు రాకుండా జీతాలు తీసుకుంటే ఎలా

**ఇది ముమ్మాటికీ అనైతిక చర్యే అవుతుంది**

**ఇలాంటివి నిరోధించేలా చట్టం తీసుకుని రావాలి**

**శాసనసభాపతుల సదస్సులో స్పీకర్ అయ్యన్న వ్యాఖ్య**



లక్నో,జనవరి21 (శ్రీచక్ర) శాసనసభకు ఒక్క రోజు కూడా హాజరు కాకుండా కొందరు ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. నో వర్క్.. నో పే' అనే విధానం చట్టసభల్లోనూ రావాలని ఆయన అన్నారు. దానికి అనుగుణంగా చట్టం చేయాలని.. దానికి సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆయా విభాగాల్లో ఉద్యోగులు విధులకు హాజరు కాకపోతే.. సంబంధిత అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సహా వారి వేతనాలు నిలిపి వేస్తున్నారన్నారు. మరి తాము ఎన్నుకున్న ఎమ్మెల్యేలు సభకు రానప్పుడు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అయ్యన్న తెలిపారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు. కొందరు ఎమ్మెల్యేలు ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. సభకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తుంటే వేదన కలుగుతోంది. అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఉంటారా?ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్-నో పే' నిబంధన అమలు చేయాలి. అలాంటి వారిని రీకాల్ చేసేలా ప్రజలకు హక్కు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. 2024 ఎన్నికల తర్వాత అసెంబ్లీకి ఒక్కరోజు కూడా రానివారు ఉన్నారని.. కనీసం సభలో జరిగే ప్రశ్నోత్తరాలు, చర్చల్లోనూ పాల్గొనడం లేదని ఏపీ స్పీకర్ పేర్కొన్నారు. దీనివల్ల తమను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఇలా సభకు హాజరు కాకపోవడం వలన ప్రజల దృష్టిలో సభ్యులు చులకనవుతున్నారని చెప్పుకొచ్చారు. సభకు హాజరు కాకుండానే వారు వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారంగా.. 'నో వర్క్.. నోపే' విధానానికి అనుగుణంగా చట్టం చేయాలని.. అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని కోరారు. సభకు రానివారిని రీకాల్ చేసే హక్కు ప్రజలకు కల్పించేలా చట్టం చేయాలని ఏపీ స్పీకర్ ప్రతిపాదించారు.

# ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు రంగం సిద్ధం

అమరావతి(శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధంగా ప్రకటించేందుకు రంగం సిద్ధమైంది. అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించింది. 2024 జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో.. ఏపీకి రాజధానిని తప్పక ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, రాజధానిగా అమరావతి ఎంపిక ప్రక్రియ, నిర్మాణ కార్యక్రమాలపై వివరాలను కూడా



కేంద్రానికి నోట్ ద్వారా అందించారు.ఈ విషయమై. . కేంద్రం ఇప్పటికే అన్ని మంత్రిత్వ శాఖల నుంచి అభిప్రాయాలు సేకరించేసి, నీతి ఆయోగ్ అభిప్రాయాన్ని కూడా కోరినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా ప్రకటించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# మరో ఐదేళ్లు అటల్ పెన్షన్ యోజన పథకం పొడిగింపు..

**కేంద్ర కేబినెట్ నిర్ణయం**



న్యూఢిల్లీ, జనవరి 21(శ్రీచక్ర) : ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ అందించే లక్ష్యంతో తీసుకొచ్చిన అటల్ పెన్షన్ యోజన పథకాన్ని మరికొన్నేళ్ల పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకానికి మరింత విస్తృతి కల్పించడంతో పాటు మరింత అభివృద్ధికి ఖర్చు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది అంటే.. 2026 జనవరి 19 నాటికి ఈ పథకంలో 8.66 కోట్ల మంది చందాదారులుగా చేరారు.ప్రభుత్వ ఉద్యోగులు రిటైరైన తర్వాత.. వారికి పెన్షన్ అందుతుంది. కానీ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు అలాంటి అవకాశాలుండవు. దీనిని దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం 2015లో 60 ఏళ్లు దాటిన కార్మికుల కోసం.. అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది.

# వసంతరాయలు కుటుంబాన్ని పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కృష్ణా: (శ్రీచక్ర) రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జనసేన కార్యకర్త వసంతరాయలు కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. పవన్‌తో పాటు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, రామకృష్ణ, విక్కుర్తి శ్రీనివాస్.. వసంతరాయలు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..'జులైలో వసంతరాయలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కుటుంబసభ్యులు వసంతరాయలు అవయవాలను దానం చేసి ఐదుగురికి కొత్త జీవితం ఇచ్చారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు మంచి నిర్ణయం తీసుకున్నందుకు నా ధన్యవాదాలు. నేను స్వయంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పేందుకు వచ్చాను. వారి కుటుంబానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అండగా నిలబడ్డారు. ప్రభుత్వ పరంగా కూడా వారికి చేయూతను ఇవ్వాలని కలెక్టర్‌ను కోరాను. వసంతరాయలు బిడ్డకు వినికిడి లోపం ఉన్నందున ఆపరేషన్ ఉచితంగా చేయించేలా చర్యలు తీసుకుంటాం. టీటీడీ ద్వారా ఆస్పత్రిలో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. నా రాక సందర్భంగా స్వాగతం పలికిన కూటమి నేతలందరికీ ధన్యవాదాలు' అని అన్నారు.



# సంపాదకీయం

## బీజేపీలో యువతరం....

భారతీయ జనతా పార్టీలో తరాల మార్పు మొదలైంది. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బీజేపీ జాతీయ సారథ్య బాధ్యతలను యువ నాయకుడు నితిన్ నబిన్‌కు అప్పగించడం భారత రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం 45 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడవ్వడం అంటే అది సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, రాబోయే రెండు దశాబ్దాల రాజకీయాలను శాసించేలా మోదీ–షా ద్వయం రచించిన ఒక పకడ్బందీ వ్యూహం అని చెప్పొచ్చు. నితిన్ నబిన్ ఎదుగుదల వెనుక వారసత్వ రాజకీయాల నీడ లేదు.. కేవలం కఠోర శ్రమ, అంకితభావం మాత్రమే ఉన్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానం బీహార్ గల్లీల నుండి మొదలైంది. భారతీయ జనతా యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీహార్ యువమోర్చా అధ్యక్షుడిగా ఆయన పార్టీ క్యాడర్‌ను కింది స్థాయి నుండి నిర్మించారు. 2006లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్, అప్పటి నుండి వెనుదిరిగి చూడలేదు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. బీహార్ ప్రభుత్వంలో రోడ్లు, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కేవలం పార్టీని నడపడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఎలా నడపాలో కూడా తెలిసిన నాయకుడు కావడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది. బీజేపీలో ఎంతోమంది సీనియర్లు, హేమాహేమీలు ఉన్నప్పటికీ నితిన్ నబిన్ వైపే మొగ్గు చూపడానికి ప్రధాన కారణం ఆయనకున్న 'సమన్వయ కర్త' అనే ఇమేజ్. మోదీ–షాల వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో ఆయన దిట్ట. పార్టీ గీసిన గీతను దాటకుండా, అందరినీ కలుపుకుపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన కాయస్థ సామాజిక వర్గానికి చెందినవారు. ఇది రాజకీయంగా తటస్థ వర్గంగా పరిగణించబడుతుంది. ఏ ఇతర బలమైన కుల వర్గాలతోనూ ఘర్షణ లేని నేపథ్యం కావడం వల్ల, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కుల సమీకరణాలను సమన్వయం చేయడం ఆయనకు సులభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 80 ఏళ్లు పైబడిన సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో నడుస్తుంటే, బీజేపీ 45 ఏళ్ల యువకుడిని తెరపైకి తెచ్చి దేశ యువతకు ఒక బలమైన సంకేతాన్ని పంపింది. నితిన్ నబిన్ సామర్థ్యంపై అధిష్టానానికి పూర్తి నమ్మకం కలిగించింది 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే. అప్పట్లో అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తిరుగులేని శక్తిగా ఉండేవారు. సర్వేలన్నీ బీజేపీ ఓడిపోతుందని చెప్పాయి. ఆ క్లిష్ట సమయంలో పార్టీ ఇన్‌చార్జ్‌గా వెళ్లిన నబిన్, తన మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహంతో అద్భుతం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో బూత్ కమిటీలను బలోపేతం చేసి, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ తిరిగి తన ఉనికిని చాటుకోవడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. కష్టమైన టాస్క్‌లను సైతం సైలెంట్‌గా పూర్తి చేసే 'ట్రబుల్ షూటర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు. నితిన్ నబిన్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు, ముళ్ల బాట ఉంది. బీజేపీకి ఇప్పటికీ సవాల్‌గా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం ఆయన ప్రాథమిక లక్ష్యం. త్వరలో జరగబోయే బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఆయన సారథ్యానికి పరీక్షగా నిలవనుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో కొత్తగా చేరే కోట్లాది మంది యువ ఓటర్లను బీజేపీ వైపు తిప్పుకోవడం కోసం ఆయన తనదైన శైలిలో పార్టీని డిజిటల్, క్షేత్రస్థాయిలో ఆధునీకరించాల్సి ఉంది. తిన్ నబిన్ 1980 మే 23న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా, తల్లి మీరా సిన్హా. కిశోర్ సిన్హా సీనియర్ బీజేపీ నాయకుడు. ఆయన పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా, నితిన్ నబిన్ 1996లో పాట్నాలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలో పాసయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎస్‌కేఎం పబ్లిక్ స్కూల్ నుంచి 1998లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. నితిన్ నబిన్.. దీప్‌మాలా శ్రీవాస్తవను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా.. నితిన్ నబిన్ రాజకీయ ప్రస్థానం 2006 ప్రారంభమైంది. పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. రాజకీయాల్లోకి ప్రవేశించారు నితిన్. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. ఆయన బాంకిపూర్‌కు మారారు. అప్పటి నుంచి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తన కంచుకోటను కాపాడుకున్నారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో కూడా నితిన్ నబిన్ కీలక పదవుల్లో పనిచేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఆగస్టు వరకు రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2025 ఫిబ్రవరి నుంచి 2025 డిసెంబర్ వరకు తిరిగి అదే శాఖ బాధ్యతలను చేపట్టారు. ఇక 2024 మార్చి 2025 ఫిబ్రవరి మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారించారు.

# ఆదోని డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్



ఎమ్మిగనూరు,జనవరి, 21 (శ్రీ చక్ర):–ఆదోని డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని ప్రజల న్యాయమైన డిమాండ్‌కు మద్దతుగా, ఈ నెల 24వ తేదీన జరగనున్న ఆదోని జిల్లా బందులో పాల్గొనాలని కోరుతూ ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠని ఎమ్మిగనూరులోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఆదోని డివిజన్ ను ప్రత్యేక జిల్లాగా కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయని అందుకే ఆదోని డివిజన్ ను ప్రత్యేక జిల్లాగా చేయవలసిన అర్హతలు, పరిపాలనా అవసరాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బుట్టా శివ నీలకంఠకి సవివరంగా వివరించారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభా, చారిత్రక ప్రాధాన్యత, ఆర్థిక వనరుల పరంగా ఆదోని డివిజన్ అన్ని విధాలా ప్రత్యేక జిల్లాగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రాలు దూరంగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం ప్రత్యేక జిల్లా మాత్రమేనని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న ఆదోనిని జిల్లా చేయాలనే సంకల్పంతో చేపట్టిన సంపూర్ణ బందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు అందించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు బందులో పాల్గొనేలా సహకరించాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదోని జిల్లా బందుకు సంబంధించిన పోస్టర్లను బుట్టా శివ నీలకంఠ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బుట్టా శివ నీలకంఠ మాట్లాడుతూ, ఆదోని డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే న్యాయమైన ప్రజా డిమాండ్‌కు మద్దతుగా ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న బందును ఎమ్మిగనూరు పట్టణంలోని వ్యాపారులు, విద్యా సంస్థల అధినేతలు, పట్టణ ప్రజలు, విద్యార్థులు, యువజనులు, మేధావులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు, వివిధ సంస్థల అధినేతలు, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా, స్వతహాగా పాల్గొని తమ వంతు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ బందు ద్వారా ప్రజల ఐక్యతను చాటుతూ, ఆదోని జిల్లా సాధన ఉద్యమాన్ని మరింత బలపర్చాలని, తమ సంపూర్ణ మద్దతుతో ఈ బందును విజయవంతం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఆదోని డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్ ప్రజల న్యాయమైన ఆకాంక్ష అని పేర్కొన్నారు. పరిపాలన ప్రజలకు చేరువ కావాలంటే, ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావాలంటే ఆదోని డివిజన్‌కు జిల్లా హోదా తప్పనిసరిగా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు, సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అలాగే 24న జరిగే బందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి, జిల్లా చేనేత అధ్యక్షులు యంకె శివ ప్రసాద్ ,జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు కోరిశెట్టి మధుబాబు, పట్టణ కార్యవర్గ సభ్యులు గురువ మాభాష, 3వ వార్డు ఇన్‌చార్జ్ చేనేత మల్లి పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అలాగే ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు కామలే గణేష్ ,సత్యనారాయణ రెడ్డి, ఉదయ్ ,తదితరులు ఈ సమావేశంలో పాల్గొని ఆదోని డివిజన్ ప్రత్యేక జిల్లా సాధన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# శ్రీసిటీలో 'ఆధ్యాత్మికతతో కర్తవ్య నిర్వహణ' అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగం





శ్రీసిటీ జనవరి 21(శ్రీ చక్ర)శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి, హైదరాబాద్‌కు చెందిన విజ్డమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఆధ్యాత్మికతతో కర్తవ్య నిర్వహణ' అనే అంశంపై బుధవారం ఉదయం శ్రీసిటీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తత్వవేత్త వినయ్ జీ స్ఫూర్తిదాయక ప్రసంగం చేయగా, పలువురు పరిశ్రమల ఉద్యోగులు, విద్యావేత్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ఆధునిక జీవనంలో ఆధ్యాత్మికత ఆవశ్యకతపై తగు అవగాహన పొందారు. స్థానిక బీరోలెక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్ రెడ్డి అతిథిని పరిచయం చేసి, వినయ్ జీ బోధనలపై తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. వినయ్ జీ తన ప్రసంగంలో భగవద్గీత ఆధారంగా ఆధునిక ఉద్యోగ జీవనంలో ఆధ్యాత్మికత ప్రాముఖ్యతను వివరించారు. ఫలితాలను ఆశించకుండా కర్తవ్య నిర్వహణ చేయడం, జయాపజయాల పట్ల నిశ్చల భావన కలిగి ఉండటం ద్వారా పని మరింత అర్థవంతంగా మారుతుందని తెలిపారు. కర్మయోగం ద్వారా నైతిక నాయకత్వం, ఆత్మ నియంత్రణ, మానసిక స్థైర్యంసాధ్యమవుతాయని వివరించారు. రాజస, తమస, సాత్విక గుణాలపై విశ్లేషన, సోదాహరణ ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ఆత్మ నియంత్రణ ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, నిరర్థక విషయాలపై దృష్టి పెట్టకుండా, జాగరూకతతో ఉద్దేశ్యపూర్వకమైన కార్యాచరణను ఆచరించమని సభికులను ప్రేరేపించారు. చివరగా కర్తవ్య నిర్వహణలో ఆధ్యాత్మికత అనేది పూర్తిగా జ్ఞాన ఆధారిత చర్య అని ఆయన నిర్ధారించారు. .తమ ఆహ్వానం మేరకు శ్రీసిటీ విచ్చేసి విలువైన ప్రసంగం చేసిన వినయ్ జీకి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం పరిశ్రమల వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఉత్సాహంగా పాల్గొని, వ్యాపార నిర్వహణ, వ్యక్తిగత అభివృద్ధిలో ఆధ్యాత్మికతను ఎలా అమలు చేయాలన్న అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం వ్యక్తిగత శ్రేయస్సు, సంస్థల పనితీరు మెరుగుదలకు దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. విజ్డమ్ ఫౌండేషన్ 2017లో వినయ్ జీ స్థాపించిన ఒక ధార్మిక సంస్థ. ఇది సనాతన ధర్మంలోని మూల సూత్రాలను ప్రజలకు పరిచయం చేసి, వాటిని ఆచరణలోకి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తుంది. ఈ సంస్థ ఉపన్యాసాలు, అధ్యయన తరగతులు, వర్క్‌షాప్‌లు, కార్పొరేట్ సెమినార్లు ద్వారా ఒత్తిడి నిర్వహణ, స్వీయ అభివృద్ధి మరియు అర్థవంతమైన జీవన విధానానికి దోహదపడే ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తాయి.

# కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన తహసిల్దార్ కే.జయ జయ రావు



కోట: జనవరి 21(శ్రీ చక్ర):కంటి చూపు ఉంటే ఏ పనైనా సక్రమంగా చేసుకునేందుకు శరీరం సహకరిస్తుందని కోట మండల తహసిల్దార్ జయ జయ రావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కోట పంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీలో చెందోడు గ్రామానికి చెందిన స్వర్గీయ ముప్పవరపు. వెంకటేశ్వరరావు మరియు శ్రీమతి ఆదిలక్ష్మి గారి పేరిట ఏర్పాటైన ఎం వి రావు ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవం సందర్భంగా గిరిజన కాలనీ వాసులకు నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఆ శిబిరాన్ని తహసిల్దార్ ప్రారంభించారు. జయ జయ రావు ముందుగా వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలవన చేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఈ సేవా కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తున్నారని తాను వివిధ పనుల వల్ల ఈ కార్యక్రమాలకు రాలేకపోయానని నేడు కచ్చితంగా వీరి సేవా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు వచ్చి ఈ శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీ కోట పంచాయతీ పరిధిలోని పలువురు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో కొంత మందికి పైగా కంటి అద్దాలు కావాలని గుర్తించగా. రమేష్ నేత్ర వైద్య నిపుణులు.. స్థానిక నివాసి కొక్కుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య గారు ముఖ్యంగా అవసరమైన వారికి పేదవారికి తన సహకారంతో కంటి అద్దాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిరుపేదలకు కంటి అద్దాలు గుర్తించి ఫౌండేషన్ నిర్వాహకులు ద్వారా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ పోలమ్మ, అంగన్వాడీ కార్యకర్త స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.

## రైతులు తప్పనిసరి మట్టి పరీక్షలు చేయించుకోవాలి - మండల వ్యవసాయ అధికారి జీరాగణేష్



మంత్రాలయం , జనవరి 21,(శ్రీచక్ర) : రైతులు తప్పనిసరి మట్టి పరీక్షలు చేయించుకోవాలని మంత్రాలయం మండల వ్యవసాయ అధికారి జీరాగణేష్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చెట్నెహళ్ళి , మాధవరం గ్రామంలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరం లో 1100 మట్టి పరీక్షలు నిర్వహించి రైతులు అందజేయడం జరిగిందన్నారు. మూడు పంటలకు ఒక్కసారి మట్టి పరీక్షలు కొరకు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని అడిగి భూమి పోషకాలు తెలుసుకొని , దాని ఆధారంగా ఎరువుల వాడలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల భూ సంరక్షణ , పంట యొక్క నాణ్యత పెంపొందించి , ఖర్చు తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ అరుణ కుమారి , జిల్లా వనరులు శాఖ అధికారి నాగసరోజ ,మంత్రాలయం వ్యవసాయ అధికారి తిరుమల రెడ్డి , జిల్లా అధికారులు , సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## కలగట్ల గ్రామంలో డ్రాఫ్ట్ పట్టాదార పాస్ పుస్తకాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి,



ఎమ్మిగనూరు, జనవరి, 21 (శ్రీ చక్ర):– ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలగొట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆకస్మిక తనిఖీ చేసి ఏ విధంగా డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఎలా తయారు చేశారు అని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల గురించి క్షుణ్ణంగా వారికి అర్థమయ్యేలాగా వివరించాలని, అందులోని పేరు , పొలం విస్తీర్ణం పేరులోని ఏమైనా పొరపాట్లు ఉన్నాయా, విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయా అన్న వివరాలను రైతు పరిశీలించుకునే విధంగా వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల ఆమోదం తర్వాతనే పట్టాదారు పాసుపుస్తకం ప్రింటింగ్ జరగాలని, ఆ విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం డ్రాఫ్ట్ కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పనే లక్ష్యం



వరదయ్యపాలెం జనవరి 21(శ్రీ చక్ర) ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపాలమంగళం జడ్పీ హైస్కూల్ లో ఆర్వో ప్లాంట్ ప్రారంభంప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పనే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనం మండలం లోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్కారు బడులలో కూడా కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలన్నీ సమగ్రాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఆకాంక్షించారు. ఈ మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే అభిలషించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్, పీఎం కుసుం పథకాలు సమర్థవంతంగా అమలు కావాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు , జనవరి 21 (శ్రీచక్ర): పీఎం సూర్య ఘర్ , పీఎం కుసుం పథకాలు సమర్థవంతంగా అమలు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పీఎం సూర్య ఘర్ , పీఎం కుసుం, తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు.. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి హాజరయ్యారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుం, పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం గురించి సీఎస్ కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ అంశాల్లో జిల్లాలో జరుగుతున్న పురోగతి గురించి వివరించారు. సమావేశంలో నెడ్ కాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ వీరేంద్ర , ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి ఈశ్వర్ రెడ్డి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఏపి ఎస్ పి డి సి ఎల్ ఎస్.ఇ ప్రదీప్ కుమార్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డిప్యూటీ ఇంజనీర్లు కర్నూలు నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## నమ్మకద్రోహం , దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ : సీఐ విక్రమ్ సింహ



కర్నూలు , జనవరి 21 (శ్రీచక్ర): కోడుమూరు రోడ్ లో మహేక్ ఎంటర్ప్రైసెస్ సానిటరీ షాప్ కలదు. యజమాని సల్మాన్ బాషా అందులో పని చె?యడానికి గుమస్తా గా ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి ని నియమించుకొని నెలకు రూ. 10 వేల జీతం ఇస్తూ కావాల్సిన సదుపాయాలు కల్పించినాడు. సదరు గుమస్తా మీద పూర్తి నమ్మకంతో షాపు నిర్వహణ అంతా అతనికి వదిలేసి ఉండగా, ఇదే అదనుగా భావించిన గుమస్తా ప్రవీణ్ కుమార్, యజమానికి అనుమానం రాకుండా అతనికి తెలియకుండా అతని స్నేహితుడైన పవన్ కళ్యాణ్ అనే ఆటో డ్రైవర్ తో మాట్లాడుకొని గత 5 నెలలుగా ఇద్దరూ కలిసి యజమాని లేని సమయం లో సదరు షాపు లోని సానిటరీ వస్తువులు అనగా కమోడ్స్ , వాష్ బేసిన్ లు, హ్యాండ్ వాష్ బేసిన్స్, కిచెన్ ఐటమ్స్ ఇలా రక రకాల ఐటమ్స్ ను వీరు ఇద్దరు కలిసి దొంగలించి వారి యజమానే పంపించినట్టుగా బయటి వారిని నమ్మిస్తూ సుమారు రూ. 7 లక్షల విలువ చేసే వస్తువులను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. యజమాని సల్మాన్ ఇచ్చిన ఫిర్యాదు పై నమ్మకద్రోహం, దొంగతనం కింద కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు లో వీరు ఇరువురు సదరు నేరానికి పాల్పడినారు అని ధ్రువీకరించుకొని, వారిని అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకొని విచారించారు. వారు దొంగతంగా అమ్ముకున్న వస్తువులను అన్నిటిని రికవరీ చేసుకొని సదరు యజమానికి అప్పగించి సదరు నేరానికి పాల్పడిన ఇద్దరిని రిమాండ్ కి పంపడం జరుగుతుందని సీఐ విక్రమ్ సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాల్గవ పట్టణ ఎస్సైలు చంద్రశేఖర్, శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీని నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన సంకల్ప యాత్రకు సంఘీభావం తెలిపిన ఏపీఎస్డీసీఎల్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

కొత్తకోట, జనవరి 21 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబుపై అభిమానంతో సీనీ నిర్మాత బండ్ల గణేష్ దేవుడికి మొక్కు చెల్లించేందుకు షాద్ నగర్ నుంచి తిరుమల వరకు చేపట్టిన 'సంకల్పయాత్ర'కు కొత్తకోటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి కలిసి సంఘీభావం తెలిపుతూ సంకల్ప యాత్ర విజయం సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటునట్లు తెలిపారు.



# రెవెన్యూ సమస్యలను డ్రైవ్ మోడ్ లో పరిష్కరించాలి

**రీ సర్వే ప్రక్రియ లోటుపాట్లకు తావు లేకుండా నాణ్యత గా చేయాలి రెవెన్యూ శాఖకు మంచిపేరు వచ్చేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**






కర్నూలు, జనవరి 21 (శ్రీచక్ర ): ఏ, చుక్కల భూములు, ఇనాం నుండి పట్టా, వెబ్ ల్యాండ్ కరెక్షన్ వంటి రెవెన్యూ సమస్యలను డ్రైవ్ మోడ్ లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ ఆదోని డివిజన్‌కు సంబంధించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల్లో సంతృప్త స్థాయి పెరగాలన్నారు. రెవెన్యూ శాఖకు మంచిపేరు వచ్చేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రెవెన్యూ క్లినిక్స్ , స్పెషల్ క్యాంపులు, డివిజన్ వారీగా రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలకు తక్షణ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయడం జరుగుతోందని, వీటి ద్వారా రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆదోని డివిజన్‌లో ఇనాం నుండి పట్టా భూములకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని డ్రైవ్ మోడ్ లో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల కారణంగా రైతులు తమ పిల్లల విద్య , వివాహ అవసరాల కోసం భూములు విక్రయించుకునే సమయంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను సుమోటో గా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే వెబ్ ల్యాండ్ కరెక్షన్ లు,చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భూసమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించే ముందు రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలోనే విచారణ చేపట్టాలని సూచించారు. ఇతరులు, అన్ క్లైమ్డ్ భూములు తదితర అంశాలపై ఈ నెల 24 వ తేదీన గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ సభల వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే ఐవీఆర్ఎస్ (ఎంఖీా) పబ్లిక్ పర్ సెప్షన్ సూచికలో రెవెన్యూ శాఖ పాజిటివ్ రేటింగ్ సాధించేలా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలను తిప్పుకోకుండా అధికారులు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష జరుగుతున్న నేపథ్యంలో, ప్రతి అధికారి మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి మంగళ వారం కలెక్టరేట్ లో సమీక్ష ఉంటుందని, ఇతరులు, అన్ క్లెయిమ్డ్, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, ఎక్స్టెంట్ వేరియేషన్, ల్యాండ్ క్లాసిఫికేషన్, మ్యుటేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా జరగాలని, రైతుల నుండి ఈ?కేవైసీ తీసుకుని పాస్ బుక్ అందచేయాలని సూచించారు.. డబ్బులు అడిగితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.. ఫిబ్రవరి 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వవద్దని అధికారులను ఆదేశించారు. పాస్‌పుస్తకం అందజేసే సమయంలో రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకంలోని క్యూఆర్ కోడ్ ను అందులో ఉన్న తదితర వివరాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు. రీ?సర్వే ప్రక్రియలో భాగంగా రైతుల నుండి రెండు సార్లు ఈ?కేవైసీ తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఫీల్డ్‌కు వెళ్లే ముందు కచ్చితంగా హాజరు నమోదు చేసుకోవాలని, హాజరు వేసిన తర్వాతే క్షేత్రస్థాయికి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు పాటించని పక్షంలో రాబోయే రోజుల్లో హాజరు మేరకు జీతం ఇచ్చే విధంగ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీ?సర్వే లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నాణ్యమైన పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం రెవెన్యూ శాఖ పనితీరును నిరంతరం మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. మార్చి నెల 15 నాటికి అన్ని పెండింగ్ పిటిషన్లు పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రైతుకు – రైతుకు మధ్య ఉన్న సమస్యలను ఫీల్డ్ కు వెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఇనాం నుండి పట్టా సమస్యలను ఈరోజు 2,000 పరిష్కరించే విధంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. తహసీల్దారు,సబ్ కలెక్టర్, కలెక్టరేట్ స్టాఫ్ ఇక్కడే అందుబాటులో ఉన్నందున 22 ఏ సమస్యలు, డాటెడ్ , ఇనాం నుండి పట్టా, ఇతరులు వంటి భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్ ఎస్ ఆర్ , అడంగల్ తదితర అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, డివిజన్ లోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిటి లు, సర్వేయర్ లు, కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది, మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం కావాలి

**ఉగాది నాటికి 14 వేల ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**





కర్నూలు, జనవరి 21 (శ్రీచక్ర): జిల్లాలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం కావాలని, ఉగాది నాటికి 14 వేల ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ లో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి తో కలిసి మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, ఏజెన్సీ లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఉగాది నాటికి మొత్తం 14,400 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (ఖఓంజ?1), ఖఓంజ?2తో పాటు ఇప్పటికే ప్రారంభమైన అన్ని గృహ నిర్మాణాలను మార్చి నెలాఖరు నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా, ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి ప్రోత్సాహం, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం గృహ నిర్మాణాల కోసం ప్రతి దశకు సంబంధించిన నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నదని, ఆ సమాచారాన్ని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రజల నుండి పాజిటివ్ గా ఫీడ్‌బ్యాక్ రావాలన్నారు. అలాగే గృహ నిర్మాణాలకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం పొదుపు సంఘాల ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగవంతమైన పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటి నిర్మాణాల్లో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, క్వాలిటీ తనిఖీలు నిర్వహించి మంచి ప్రమాణాలతో గృహాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన గడువులోపు గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల పురోగతిని రాష్ట్ర స్థాయిలో ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ క్షుణ్ణంగా పర్యవేక్షణ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో కూడా గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కడా ఆలస్యం లేకుండా పనులు ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటినుండి క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణాలను నిరంతరం పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న ఇళ్లను గరిష్టంగా రెండు నెలల లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆదోని రూరల్, ఆదోని అర్బన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 2,000 గృహ నిర్మాణాలను ప్రాధాన్యతగా భావించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించడంతో పాటు, నిర్మాణ సామగ్రి సరఫరా, నిధుల విడుదల, సాంకేతిక సహకారం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆదోని డివిజన్ లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడిఓ లు, కన్స్ట్రక్షన్ ఏజెన్సీలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో సమీక్షించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ చిరంజీవి , ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, ఎంపిడిఓ లు, హౌసింగ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కన్స్ట్రక్షన్ ఏజెన్సీ ల ప్రతి నిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన ఇంటి స్థలాలు కబ్జా చేయాలనుకోవడం దుర్మార్గం

**భూ కబ్జాదారులపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు :మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి**





నందికొట్కూరు, జనవరి 21 (శ్రీచక్ర): ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఇంటి స్థలాలు ఇచ్చిందని, ఆ స్థలాలు కబ్జా చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని వికలాంగులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికీ ఈ సమస్య తీసుకొని వెలుతానని, వికలాంగులకు న్యాయం జరిగేందుకు తాను అండగా ఉంటానని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రభుత్వంకు చెడ్డపేరు వస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా నందికొట్కూరులోని బైరెడ్డి నివాసం లో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బైరెడ్డి మాట్లాడుతూ 2004 వ సంవత్సరంలో నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో సర్వే నెంబర్ 229ం, 229ఎ లో 12 ఎకరాల 5 సెంట్ల స్థలాన్ని తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో నేను వికలాంగులకు ఇంటి స్థలాలకు కేటాయించడం జరిగిందనీ. 450 ప్లాట్లను పంపిణీ చేశామన్నారు. నా హయం తర్వాత ఎంతో మంది ఎమ్మెల్యేలు వచ్చిన వికలాంగుల ను ఎవ్వరూ కదిలించలేదన్నారు. దివ్యాంగులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న మేము వీరు భవిష్యత్తు బాగు పడితే ఒక 4000 మందికి నివాసం ఏర్పాటు చేసిన వారమౌతమని అనుకున్నాం అన్నారు. అయితే ఇప్పుడు ఒక దేవాదాయ శాఖ వారు ఒక బోర్డును వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో బోర్డు ఏర్పాటు చేశారని, అక్కడి భూమిలో గల స్థలాన్ని చదను చేయించి ఒక టీడీపీ నాయకుడు కబ్జా చేయాలని ప్రయత్నం చేయడం చూస్తే వీరి ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయని బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చాలా స్థలాలను కబ్జా చేస్తూ దౌర్జన్యాలకు పలుకుతున్న వీరిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాననీ, దేవాదాయశాఖలో కలుపుకుని ఈ వికలాంగుల స్థలాన్ని కొట్టేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని. ప్రభుత్వ కార్యాలయాల్లో తిష్టవేసి వీరి పనులు జరిపించుకోవడం చేస్తున్న వీరిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని. వికలాంగులకు జరుగుతున్న ఈ అరాచక అన్యాయాన్ని కచ్చితంగా అడ్డుకుని వీరి న్యాయం జరిగేంతవరకు పోరాటం సాగిస్తామని బైరెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. నందికొట్కూరు నియోజకర్గమే కాకుండా నంద్యాల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గంలో ఇలా వికలాంగులకు ఒకకాలనీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్నితాను కోరుతున్నానన్నారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా వికలాంగులకు ఇంటి స్థలాలను కేటాయించడం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నందికొట్కూరు నియోజకవర్గంలోనే జరగడం విశేషం అన్నారు. వీరికి ఇలా సాయం చేయడమే మేము చేసిన తప్పా అని కబ్జా చేస్తున్న వారిని అడుగుతున్నానని బైరెడ్డి నిలధీశారు.

## జాయింట్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన స్టేట్ బ్యాంక్ అధికారులు



మార్కాపురం జనవరి 21 ( శ్రీజక)మార్కాపురం. జాయింట్ కలెక్టర్ నుర్యాదపూర్యకంగా కలిసిన భారతీయ స్టేట్ బ్యాంకు అధికారుల× భారతీయ స్టేట్ బ్యాంక్ కందుకూరు రీజినల్ మేనేజర్ శ్రీ వనపర్తి అప్పలరాజు బుధవారం నాడు మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ పులి శ్రీనివాసరావునిమర్యాదపూర్వకంగా వారి ఆఫీసు లో కలవడం జరిగింది. ఈ సందర్భంగా అప్పలరాజు గారు స్టేట్ బ్యాంక్ చేస్తున్న ప్రభుత్వ సేవల గురించి విశదీకరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యవసాయ మరియు సూక్ష్మ రుణాల కేంద్రం ముఖ్య నిర్వహణాధికారి శ్రీ భువనగిరి విద్యాసాగర్ గారు , మార్కాపురం స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ ముఖ్య నిర్వహణాధికారి శ్రీ నాగలాపురం హరి మరియు బ్యాంకు యూనియన్ నాయకులు కొత్తేర్వ కాశిరెడ్డి పాల్గొన్నారు.

## సర్పంచ్ సతీష్ రావు అధ్యక్షతన హసన్ బాధ లో సామాజిక తనిఖీ గ్రామ సభ.





రామచంద్రపురం, జనవరి 21( శ్రీచక్ర)రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో వి.బి.జి.రామ్ జి గా మార్చబడిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సరానికి సంబంధించి డి. ఆర్.పి.వడ్డి రమణ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. సోషల్ ఆడిట్ రిపోర్ట్ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావుకు సిబ్బంది అందజేశారు.సర్పంచ్ మాట్లాడుతూ వి.బి.జి.రామ్ జీ జాబ్ కార్డు అర్హత కలిగిన వారు అప్లై చేసుకోవాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు పని దినాలు పెంచడం, సమయానికి వేతనాలు, నిరుద్యోగ భృతి వంటి పలు కార్యక్రమాలు చేపట్టిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ఉపాధి హామి పథకం వేతనదారులు,జె.ఇ. పంచాయితీ కార్యదర్శి సబ్బెల్ల ప్రసాద్ రెడ్డి, వి.ఆర్.ఓ నరహరిశెట్టి సత్తిబాబు, సచివాలయం, పంచాయతీ రెవిన్యూ సిబ్బంది,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" చైర్మన్ సత్యం కు ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానం .

రామచంద్రపురం, జనవరి 21( శ్రీచక్ర)సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంకు అరుదైన గౌరవం దక్కింది. జనవరి 26 రిపబ్లిక్ డే పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ లోక్ భవన్లో అదే రోజు నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానం అందింది. ఈ మేరకు ఈవిషయాన్ని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ద్వారా వాసంశెట్టి సత్యం కు ఆహ్వానం అందిందని ఈసంధర్భంగా తెలియజేశారు. సమాజానికి వివిధ రూపాల్లో సామాజిక సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానించడం పరిపాటికాగా ఇందులో భాగంగా రామచంద్రపురం నియోజవర్గం తోపాటు , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా పలు సేవాకార్య క్రమాలు నిర్వహించినందుకు గాను ఎట్ హోం కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వాసంశెట్టి సత్యం వెళ్ళనున్నారు . ఈసందర్భంగా ఆయనని కూటమి పార్టీ నాయ కులు, కార్యకర్తలు అభిమానులు అభినందించారు



# అఖిలభారత యాదవ సంఘం జిల్లా సమావేశం



మార్కాపురం జనవరి 21 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా అఖిలభారత యాదవమహాసంఘంకార్యాలయంలో జరిగినటువంటి శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థానం సమావేశంలోఅధ్యక్షతవహించినటువంటి కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజుయాదవ్.కాటమరాజుదేవాలయంలో స్వామివారికి వెండి తోటి తొడుగు గతంలో భక్తులు ఇచ్చినటువంటి వెండి వస్తువులను కరిగించి చేయించామని తెలిపారు. అదేవిధంగా అటు పిమ్మట నుండి వచ్చినటువంటి 46 వెండి గొడుగులు చిన్నవి పెద్దవి రెండు వెండి గంటలు ఐదు వెండి కండ్లు రెండు వెండి మీసములు చిన్న నాగాభరణములు వెండివి రెండు మరికొన్ని చిన్న చిన్న వస్తువులు అన్నిటిని కూడా కరిగించి గంగమ్మ తల్లికి వెండి తొడుగు అలంకారంగా చేయించాలని ఈరోజు జరిగిన రెండు కమిటీ సమావేశంలో తీర్మానించారు అని ఆయన తెలియజేశార భక్తులు అనేకమంది తిరుణాల సమయంలో మరియు మిగతా సమయాల్లో స్వామివార్లకు సమర్పించాలనుకున్నటువంటి ఎటువంటి నగదు రూపేనా కానీ వస్తురూపేనా కానీ కమిటీ వారికి ఇచ్చితగినరసీదుపొందవలసినదిగా తెలియజేయడమైనది. నేటి సమావేశంలో ప్రతి ఆదివారం కమిటీ సభ్యులు విధిగా కాటంరాజు ఆలయ సందర్శనకు వెళ్లాలని అక్కడ బలులు ఇస్తున్నటువంటి విధానంలో పరమతల వారు రాకుండా తగువిధంగా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ అధికారులకు కూడా సమాచారం ఇస్తున్నామని కావున ఇతర మతస్తులు ఎవరు కూడా స్వామి వారి దగ్గర ముక్కులు చెల్లించే విషయంలో హిందూ ధర్మం ప్రకారమే ముందుకు నడవాలని ఆలయ కమిటీ ముఖ్య బాధ్యులు పి ఎల్ పి యాదవ తెలియజేశారు. అనేకమంది భక్తులు తమలో కొంతమంది లేదా తమరి ఆహ్వానాన్ని మన్నించి కాటంరాజు ఆలయానికి వచ్చినటువంటి బంధుమిత్రులు పరమతానికి సంబంధించిన విధంగా వంటలు చేస్తేనే తాము భోంచేస్తామంటున్న కారణంగా ఆచార వ్యవహారాలకు భిన్నంగా పరమతల ఆచారాలను ఇక్కడ ప్రవేశపెట్టడాన్ని తాము పోలీసు శాఖకు కూడా సమాచారం ఇచ్చామని ఆయన తెలియజేశారు కావునమొక్కులుచెల్లించుకోవడానికి వచ్చేటువంటి యాదవులు భక్తులు అందరూ కూడా ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారంగా హిందూ మత సాంప్రదాయ ప్రకారంగా కమిటీ వారితో సహకరించవలసిందిగా ఆయన మనవి చేశారు. తిన్నాను ఇప్పుడు మార్చి నెలలో 18 వ తేదీన జరగనున్నటువంటి శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థానం యొక్క భారీ తిరునాళ్లకు వచ్చేటువంటి భక్తులందరి సౌకర్యార్థం అవసరమైనటువంటి ఏర్పాట్లు అన్నిటిని చేయాలని ఈ సమావేశంలో తీర్మానించడం అయినది. ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా ఉన్నటువంటి మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ శ్రీ గూడూరు ఎలక్షన్ బాబు గారి సహాయంతో ఆలయం వద్ద ఏర్పాటు చేయదలచినటువంటి అనేక వసతులను కూడా తిరుణాల నాటికి సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వారు ఇచ్చిన మాట ప్రకారం గా ఓవర్ హెడ్ ట్యాంక్ విత్ పవర్ బోరుకు శాంక్షన్ తీసుకుని వచ్చి వారే బోరును పూజాదికాలు నిర్వహించి ప్రారంభించారని పి ఎల్ పి యాదవ్ తెలియజేశారు. నేటి ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ ఉపాధ్యక్షులు అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్ కోశాధికారి గోసు వెంకట సుబ్బారావు యాదవ్ సహాయ కార్యదర్శి నాగం వెంకటేష్ యాదవ్ కమిటీ సభ్యులు తాళ్ల అల్లూరి కుమార్ యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, ఆలయ కమిటీ న్యాయ సలహాదారుడు పిన్నిక నాగర్జున ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు

# రైల్వే జనరల్ మేనేజర్ కు పలు సమస్యల పై వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు డాక్టర్ షేక్ మహబూబ్ వలి



మార్కాపురం జనవరి 21( శ్రీ చక్ర)మార్కాపురం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్.ర్సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సాధారణ తనిఖీల్లో భాగంగా మార్కాపురం రైల్వే స్టేషన్ లో సందర్శించారు అనంతరం ఆయనకుమార్కాపురం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులుడాక్టర్ షేక్ మహబూబ్ అలీ జనరల్ మేనేజర్ కు విశాల్వాతో సన్మానించి అనంతరం పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.పలుసమస్యలు(1. )మార్కాపురం రోడ్డు మీదుగా వెళ్లే ప్రతి ఎక్స్ ప్రెస్ మరియు సూపర్ ఫస్ట్ ట్రైన్ లో జనరల్ అదనపు భోగిలను పెంచాలి.2. మార్కాపూర్ రోడ్డు మీదుగా దేశ రాజధాని న్యూఢిల్లీకి వెళ్లడానికి కొన్ని వీక్లీ ట్రైన్ లను ప్రవేశపెట్టవలసిందిగా కోరారు.3. అధునాతనమైన ఏసీ మరియు స్లీపర్ క్లాస్ వెయిటింగ్ రూమ్లను ఏర్పాటు చేయాలి.4. మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్ లో రిజర్వేషన్ కౌంటర్ ఉదయం 8 నుండి సాయంత్రం 8 వరకు అందుబాటులోఉండేలాచేయాలి.5. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే రూటులో ఉన్నటువంటి పొదిలి దగ్గర ఒంగోలు కర్నూలు రూట్ లో క్రాసింగ్ హాల్ట్ నీ ఏర్పాటు చేయాలి. 6.తర్లుపాడు రైల్వే స్టేషన్లో ఎక్స్ప్రెస్ మరియు సూపర్ ఫాస్ట్ ట్రైన్లకు నిలబడేటట్లు (స్టాప్ )ఏర్పాటు చేయాలి.ఈ ప్రాంత ప్రజలు నిత్యం తమ రోజువారి జీవన ఉపాధి కోసం మరియు వైద్య పరంగా దూర ప్రాంతాలకు వెళ్ళవలసి ఉంటుంది జనరల్ బోగీలు తక్కువగా ఉండటం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు కావున అదనపు భోగిలను ఏర్పాటు చేయాలి. మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్ నుండి శ్రీశైలం మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లాలంటే వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు వారికి వెయిటింగ్హాల్సరైనటువంటి వసతులు లేనందున మరియు వేటింగ్ హాల్ చిన్నది గా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడకుండా అప్పర్ క్లాస్ వెయిటింగ్ హాల్ మరియు స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాల్ నుఏర్పాటుచేయవలి.ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియుమార్కాపురంనియోజకవర్గ సమన్వయకర్త షేక్ సైదా గారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్లోవచ్చినటువంటి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గారికి కలిసి ఈ ప్రాంతం యొక్క సమస్యలను తెలపడం జరిగిందిఈకార్యక్రమంలో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ మరియు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్లా మరియు షేక్ ఖాసిం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ ఈ ప్రాంతసమస్యలుతమరుపరిష్కరించవలసిందిగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది.

## జిల్లా బాలుర ఉన్నత పరిషత్ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం





మార్కాపురం జనవరి 21 (శ్రీ చక్ర) మార్కాపురం.విద్యార్థులలో ,యువకులలో ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని అర్థవంతంగా వివరించడానికి ,ప్రతీ ఓటు విలువ వివరించడానికి... ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిజాయితీగా నిర్వహిస్తూ ప్రజాస్వామ్యంబలోపేతంచేయడానికి ప్రతీ ఒక్కరు మనస్ఫూర్తిగా పని చేయాలని జాతీయ ఓటరు దినోత్సవం.సందర్భంగా.మార్కాపురం.బాలురఉన్నతపాఠశాలలోప్రధానోపాధ్యాయులు మునగాల చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు..ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించగా.. వ్యాస రచన పోటీలనందు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కు చెందిన టి. వెంకట హరికిరణ్ ప్రథమ బహుమతి, పి.శ్రుతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మార్కాపురం.. ద్వితీయ బహుమతి , తృతీయ బహుమతి కె. మంజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొట్లగట్టు కు చెందిన విద్యార్థిని ఎన్నికయ్యారు.వక్తృత్వ పోటీలనందు ప్రథమ బహుమతి సీహెచ్ షరోన్ రాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పొదిలి,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురం కు చెందిన బాను సాకేత్ ద్వితీయ బహుమతి , యాసిన్ తృతీయ బహుమతి పొందారు.క్విజ్ పోటీల నందు సీహెచ్ షరోన్ రాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పొదిలి ప్రథమ బహుమతి, ఎం వీ సుదర్శన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు పొదిలి ద్వితీయ బహుమతి, కె. మంజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొట్లగట్టు తృతీయ బహుమతి కి ఎంపికయ్యారని వీరందరూ ఈ నెల 23 వ తారీకు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఒంగోలు నందు నిర్వహించే జిల్లా స్థాయి పోటీలనందు పాల్గొనాల్సి ఉంటుందని ఉప విద్యాశాఖాధికారి మామిళ్ల పల్లి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మార్కాపురంవిద్యాశాఖాధికారులు రామ్ దాస్ నాయక్, శార్వాణీ సాధన డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రి , ఉపాధ్యాయులు సైమన్, ,రవి కిషోర్, సకృనాయక్ , మరియు వివిధ పాఠశాల నుండి మండల స్థాయి విజేతలయిన విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వ్యక్తి చేయి కట్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స.

**<u>రెండు గంటల పాటు సాగిన ఆపరేషన్.</u>**

**<u>డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు.</u>**








రామచంద్రపురం, జనవరి 21( శ్రీచక్ర)కొయ్య చక్కను కట్ చేస్తుండగా మిషన్ జంపై ఒక వ్యక్తి చేయి మీద పడి తెగిన సంఘటన కుయ్యేరు గ్రామంలో చోటుచేసుకుంది. దీంతో హుటా హుటీన రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా వెంటనే ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ఎస్ ప్రవీణ్, మరో సర్జన్ కళ్యాణబాబు లు అప్రమత్తమై వెంటనే క్షతగాత్రు నికి సుమారు రెండు గంటలపాటు శాస్త్ర సికిత్స చేసి కాపాడ గలిగారు. ఈ మేరకు బుధవారం కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందినయాళ్ళ సూరిబాబు అనే వ్యక్తి చెక్కను మిషన్ తో కోయు చుండగా అతనికి ఎడమచేతి కి ప్రమాదవశాత్తు బ్లేడ్ కట్ అయి చేయి రక్త నాళాలు తెగిపోయాయాయి దీంతో చాలావరకూ రక్తం పోయి చూడటానికే గగుర్పాటు కలిగించే దృశ్యం రామచంద్రపురం ఏరియాలో హాస్పిటల్ లో ఆపరేషన్ చేసి మరల అతికించి యథాస్థితికి తీసుకువచ్చారు. దీంతో క్షతగాత్రుడు సూరిబాబు క్షేమంగా ఉన్నట్లు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ఎస్ ప్రవీణ్ సందర్భంగా తెలియజేశారు. ఈసందర్భంగా సూరిబాబు కుటుంబ సభ్యులు చేయికి ఆపరేషన్ చేసిన డాక్టర్లు ప్రవీణ్ ,కళ్యాణ్ బాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని సుష్మ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

కాజులూరు, జనవరి 21( శ్రీచక్ర)గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని బుడితి సుష్మ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యింది.ఈమేరకు విషయాన్ని పాఠశాల హెచ్ఎం ఎస్ ఎస్ బి సుశీల మణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.తెలిపారు. డిసెంబర్ 11 నుండి 13 వరకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం లో జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్ 17 సాఫ్ట్ బాల్ స్టేట్ మీట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఫిబ్రవరి 4 నుండి 8 వరకు చత్తిస్గర్ రాష్టం బిలాస్ పూర్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహిస్తుందని పీడీ జి సునీల్ కుమార్ తెలిపారు.జాతీయ స్థాయికి ఎంపిక అయిన సుష్మ ని శిక్షణ ఇచ్చిన పీడీ లు సునీల్, ఇమ్మాయేల్ రాజ్ ని గ్రామ సర్పంచ్ పి. ప్రసన్న మౌనిక, ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరి వాసు రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివ శంకర్, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, నీటి సంఘ అధ్యక్షులు రామారెడ్డి, చుండ్రు వీర్రాజు చౌదరి, అంగర శ్రీను, తోట కృష్ణ, నున్న కాశీ విశ్వనాధ్, దీవెన మెడికల్స్ వెంకన్న బాబు,పలివెల రాజు, మాత నాగరాజు, చిన్నా డాక్టర్,ఉపాధ్యాయులు గంగరాజు, ప్రసాద్, ప్రమీల, దుర్గా రత్నం తదితరులు అభినందించారు.



# ఏపీలో కొత్త పార్టీలు

విజయవాడ, జనవరి 21, ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం.. కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉ ండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు. ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# టీడీపీలో సెకండ్ జనరేషన్

విజయవాడ, జనవరి 21,తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఈ మార్చితో పార్టీకి 44 సంవత్సరాలు పూర్తై 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. పార్టీ ఆవిర్భావ సమయంలో యువకులుగా రాజకీయాల్లోకి వచ్చిన చాలా మంది నేతలు ఇప్పుడు వయోభారంతో సీనియర్ స్థాయికి చేరుకున్నారు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలి టికెట్ తీసుకుని అసెంబ్లీలో అడుగుపెట్టిన యువ నాయకులే, నేడు పార్టీలో అత్యంత అనుభవజ్ఞులుగా గుర్తింపు పొందుతున్నారు. కాలం మారినట్లే, రాజకీయాల్లోనూ మార్పు అవసరమన్న ఆలోచనలు ఇప్పుడు ఆ సీనియర్లలో మొదలయ్యాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ అంతటా చూస్తే, టీడీపీలోని సీనియర్ నేతల నుంచి ఒకే రకమైన మాట వినిపిస్తోంది. తాము ఇక రాజకీయాల నుంచి తప్పుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే కాకుండా, చాలా జిల్లాల్లో వినిపిస్తున్న స్వరం కావడం విశేషం. ఈ జాబితా ఎంత పెద్దదంటే, ఒక ప్రాంతీయ పార్టీలో ఇంతమంది నేతలు ఒకేసారి పక్కకు తప్పుకునే పరిస్థితి దేశ రాజకీయాల్లో అరుదేనని చర్చ సాగుతోంది.సాధారణంగా రాజకీయాల్లో వయస్సుతో సంబంధం లేదని, చివరి శ్వాస వరకూ కొనసాగుతామని చెప్పే నాయకులు ఎక్కువ. కానీ టీడీపీ సీనియర్లు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణంగా రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా నారా లోకేష్ నాయకత్వం మరింత బలపడుతూ, ఆయన చుట్టూ కొత్త తరం నాయకుల బృందం తయారవుతుందని భావిస్తున్నారు. ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని, ముందుగానే తాము తప్పుకుంటే మంచిదన్న ఆలోచన సీనియర్లలో ఏర్పడినట్టు చెబుతున్నారు.ఇదే సమయంలో మరో వ్యూహాత్మక ఆలోచన కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు వద్ద తాము కీలక పాత్ర పోషించినట్లే, ఇప్పుడు తమ వారసులను లోకేష్ టీంలోకి చేర్చితే భవిష్యత్తులో కుటుంబ రాజకీయాలకు భరోసా ఉంటుందన్న భావన కూడా ఈ నిర్ణయాల వెనుక ఉందని అంటున్నారు. "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి" అన్న సామెత రాజకీయాల్లో ఉన్నవారికి మరింత వర్తిస్తుందన్న మాట వినిపిస్తోంది.ఇటీవల నర్సీపట్నం లో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనకు 70 ఏళ్లు వచ్చాయని, ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని వేదికపైనే ప్రకటించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కుమారుడు విజయ్ పాత్రుడుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్న ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారం కూడా ఉంది. అదే విధంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా వయోపరంగా అదే దశకు చేరుకుంటుండటంతో, ఆయన కుటుంబ వారసత్వంపై దృష్టి పెట్టారని అంటున్నారు.ఈ జాబితాలో బండారు సత్యనారాయణమూర్తి , కిమిడి కళా వెంకటరావు , దాడి వీరభద్రరావు వంటి పలువురు ప్రముఖులు ఉన్నారు. ఒక అంచనాగా చూస్తే 2029 ఎన్నికల నాటికి కనీసం ముప్పయి నుంచి నలభై మంది సీనియర్ నేతలు రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశం ఉ ందన్న మాట వినిపిస్తోంది. అదే సంఖ్యలో కొత్త తరం నాయకులు రంగప్రవేశం చేసే అవకాశమూ ఉందని అంటున్నారు. ఈ మార్పులను టీడీపీ హైకమాండ్ ఎలా సమతుల్యం చేస్తుంది, అనుభవం?యువత మధ్య సమన్వయాన్ని ఎలా సాధిస్తుంది అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ



కడప, జనవరి 21, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు.ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ వైసీపీ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతాయన్నదే రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# విశాఖలో ఇమ్మిగ్రేషన్ ఆఫీస్

విశాఖపట్టణం, జనవరి 21, విశాఖపట్నం నగరం రోజురోజుకీ విస్తరిస్తూ ఒక మెగా సిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన ఈ నగరానికి తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక బహుమతి అందించింది. కేంద్ర హోం శాఖఆధ్వర్యంలో పనిచేసే ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ కార్యాలయం ప్రారంభం కావడంతో విశాఖతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు విదేశీ ప్రయాణాల విషయంలో పెద్ద ఊరట లభించనుంది.ఇప్పటికే మరో ముఖ్యమైన అభివృద్ధి కూడా సమీప భవిష్యత్తులో పూర్తి కాబోతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే కొన్ని నెలల్లో అందుబాటులోకి రానుంది. అక్కడి నుంచి తొలి అంతర్జాతీయ విమానం విదేశాలకు ఎగరబోతున్నట్టు సమాచారం. రానున్న రోజుల్లో అమెరికా, ఆస్ట్రేలియా సహా పలు దేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఇమ్మిగ్రేషన్ సేవలు తప్పనిసరి కావడంతో విశాఖలోనే ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం సమయోచిత నిర్ణయంగా భావిస్తున్నారు.ఇంతవరకూ విశాఖ లేదా ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా హైదరాబాద్ లేదా చెన్నై నగరాలకు వెళ్లి అక్కడ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి వచ్చేది. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ ఎక్కువయ్యేవి. ఇప్పుడు ఈ సదుపాయం నేరుగా విశాఖ లో లభించనుండటంతో ప్రజలకు పెద్దగా ఉపశమనం కలగనుంది. విదేశీ ఉపాధి, ఉన్నత విద్య, వ్యాపార అవసరాల కోసం వెళ్లే వారి సంఖ్య ఈ ప్రాంతంలో వేగంగా పెరుగుతోంది. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.విశాఖకు అంతర్జాతీయ హోదా మరింత బలపడేందుకు ఈ ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయం కీలకంగా మారనుంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖలో ఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరగా, వెంటనే సానుకూల స్పందన లభించడం విశేషం. ఇప్పటివరకు దేశీయ విమానాలకే పరిమితమైన విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలు, ఇకపై అంతర్జాతీయ స్థాయికి చేరుకోనున్నాయి. అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో విమాన సేవలు కూడా విస్తరించే అవకాశం ఉ ందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయి. ఐటీ రంగం, పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. భోగాపురం విమానాశ్రయం కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా ఒడిశా , ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగున ఉన్న రాష్ట్రాల ప్రజలకు కూడా ఉ పయోగపడనుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మరిన్ని విశాఖలో ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, నగర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు

## 42 ఎకరాల భూమి



విజయవాడ, జనవరి 21,హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది.ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది. బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు.ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయిబాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది.తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉ పసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది.4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సీబీఐ కీలకం

కడప, జనవరి 21, వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయించారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈరోజు విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలుసుకుంది. వచ్చేనెల ఐదుకు విచారణను వాయిదా వేసింది.ప్రధానంగా ఈ కేసులో దర్యాప్తు పూర్తిస్థాయిలో ముగిసింది అని సిబిఐ కోర్టుకు చెబితే.. సుప్రీంకోర్టు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది. సిబిఐ దర్యాప్తు పూర్తిగా జరిగిందా? ఇంకేమైనా దర్యాప్తు చేయాల్సి ఉందా? అని అడిగింది కోర్టు. అయితే సునీత మాత్రం జగన్మోహన్ రెడ్డి దంపతులకు ముందుగానే ఎలా తెలిసింది అనేది సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అదే కీ పాయింట్ అని చెప్పుకొచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారని జగన్మోహన్ రెడ్డి దంపతులకు ఎవరు చెప్పారు అన్నది సునీత సందేహం. రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందని ఆమె ఆది నుంచి సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రైల్ కోర్టుకు సునీత రాగా.. అందరూ కుటుంబ సభ్యులు కావడం వల్లే సమాచారం ఇచ్చి ఉంటారని కోర్టు అభిప్రాయ పడింది. అయితే దీనితో ఏకీభవించలేదు సునీత. అందుకే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# వెడ్డింగ్ హబ్ గా తిరుపతి

తిరుపతి, జనవరి 21, కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల?తిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే.ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది. 'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి.అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది.



# స్పోర్ట్స్ న్యూస్

## అరువు తెచ్చుకున్న స్టిక్స్ నుంచి..హ్యాట్రిక్ గోల్స్ వరకు: పద్మ చోరోల్ సక్సెస్ స్టోరీ..!!

లడఖ్‌లోని గడ్డకట్టే మంచు పలకల మీద కొందరు అమ్మాయిలు స్కేటింగ్ నేర్చుకుంటుంటే.. 'ఇది మగపిల్లలు ఆడే ఆట, మీకెందుకు?' అని ప్రపంచం ప్రశ్నించింది. కానీ, అవే విమర్శలను జయించి, ఇవాళ భారత మహిళల ఐస్ హాకీ జట్టుకు మూలస్తంభంగా నిలిచిన ధీరవనిత పద్మ చోరోల్.ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ 2026లో భాగంగా తెలంగాణ జట్టుపై 19-1తో లడఖ్ ఘనవిజయం సాధించగా, అందులో పద్మ హ్యాట్రిక్ గోల్స్‌తో విరుచుకుపడింది. ఈ సందర్భంగా ఆమె తన ప్రయాణంలోని ఒడిదుడుకులను మైఖేల్‌తో పంచుకున్నారు. ఆ స్ఫూర్తిదాయక కథనం మీకోసం..ఒకప్పుడు







సరైన షూస్ లేవు, చేతిలో స్టిక్స్ లేవు, కనీసం ఆడేందుకు ఒక మహిళా జట్టు కూడా లేదు. కానీ ఈరోజు భారత జెండాను అంతర్జాతీయ ఐస్ హాకీ వేదికలపై రెపరెపలాడిస్తున్నారు లడఖ్ మహిళలు. ఈ ప్రస్థానంలో మొదటి తరం క్రీడాకారిణిగా, ప్రస్తుతం లడఖ్ జట్టు అసిస్టెంట్ కెప్టెన్‌గా పద్మ చోరోల్ ఒక సజీవ సాక్ష్యం.2016లో మొదటిసారి భారత మహిళల ఐస్ హాకీ జట్టు ఏర్పాటైనప్పుడు పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవని పద్మ గుర్తుచేసుకున్నారు. "మాకు అసలు అంతర్జాతీయ ప్రమాణాలు ఎలా ఉంటాయో తెలియదు. అబ్బాయిల దగ్గర స్కేట్స్, స్టిక్స్ అరువుగా తీసుకుని ప్రాక్టీస్ చేసేవాళ్లం. నా పాదాల కంటే పెద్దవైన షూస్ వేసుకుని, నా ఎత్తు కంటే పొడవైన స్టిక్స్‌తో ఆడేదాన్ని. మొదటి ఏడాది చాలా కష్టంగా గడిచింది" అని ఆమె ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.లడఖ్‌లో ఏడాదికి కేవలం రెండు నెలలు మాత్రమే సహజమైన మంచుపై ఆడే అవకాశం ఉంటుంది. కానీ అంతర్జాతీయ పోటీలు కృత్రిమ మంచు మీద జరుగుతాయి. "తొలిసారి చైనీస్ తైపీలో ఆడినప్పుడు ఆ మంచు చాలా నునుపుగా, వేగంగా ఉంది. పడిపోతే కనీసం నిలబడటం కూడా కష్టమయ్యేది. కానీ మేము ఓడిపోతూనే పాఠాలు నేర్చుకున్నాం" అని పద్మ వివరించారు.2019: ఆసియా డివిజన్-1 ఛాలెంజ్ కప్‌లో భారత్ తొలిసారి కాంస్య పతకం గెలిచింది. కానీ అప్పట్లో భారత్ ఐస్ హాకీ ఆడుతుందని కూడా చాలామందికి తెలియదు.2025: యూఏఈలో జరిగిన ఆసియా కప్‌లో మళ్ళీ కాంస్య పతకం సాధించినప్పుడు మాత్రం యావత్ భారతం సోషల్ మీడియా వేదికగా పండగ చేసుకుంది. "ఎవరికీ తెలియని స్థాయి నుంచి దేశమంతా మద్దతు ఇచ్చే స్థాయికి చేరడం చాలా ప్రత్యేకం" అని ఆమె ఉద్వేగానికి లోనయ్యారు.ఐస్ హాకీ అంటే అత్యంత ఖరీదైన క్రీడ. ఒక్కో స్కేటింగ్ షూ జత ధర రూ. 1 లక్ష వరకు ఉంటుంది. స్టిక్ ధర రూ. 20-25 వేలు. 2018లో కెనడాకు చెందిన గ్రేటెస్ట్ ప్లేయర్ 'హేలీ వికెన్‌హైజర్' భారత అమ్మాయిల కష్టాలను చూసి, వారికి హెల్మెట్లు, చెస్ట్ గార్డులు, స్కేట్స్ వంటి వస్తువులను బహుమతిగా ఇచ్చారు. పద్మ ఇప్పటికీ అవే వస్తువులను వాడుతుండటం విశేషం.ప్రస్తుతం లడఖ్ ప్రభుత్వం, సాయ్ (శాంఏ) నుంచి అందుతున్న మద్దతుతో ఐస్ హాకీ రూపురేఖలు మారుతున్నాయి. "ఇప్పుడు ఖేలో ఇండియాలో 7 మహిళా జట్లు పాల్గొంటున్నాయి. డెహ్రాడూన్, పుణె వంటి నగరాల్లో కృత్రిమ ఐస్ రింక్‌లు అందుబాటులోకి వచ్చాయి. మా తదుపరి లక్ష్యం 2027 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు క్వాలిఫై అవ్వడమే" అని పద్మ ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్సీబీ, రాజస్థాన్ రాయల్స్‌కు బీసీసీఐ డెడ్ లైన్!








ఐపీఎల్ 2026 సీజన్ సమీపిస్తున్న వేళ రెండు ప్రధాన ఫ్రాంచైజీలు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ), రాజస్థాన్ రాయల్స్ తమ సొంత మైదానాల విషయంలో తీవ్ర సందిగ్ధంలో పడ్డాయి. ఈ రెండు జట్లు తమ హోమ్ వేదికలను ఖరారు చేసుకోవడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) జనవరి 27 వరకు గడువు విధించింది.ఆర్సీబీ జట్టుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ప్రాణం వంటిది. కానీ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కొత్త నిబంధనలు ఇప్పుడు ఫ్రాంచైజీకి తలనొప్పిగా మారాయి. స్టేడియం బయట ఉన్న రోడ్ల నిర్వహణ, అగ్నిమాపక దళం మోహరింపు వంటి ప్రభుత్వ బాధ్యతలను ఫ్రాంచైజీయే చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం షరతులు పెట్టింది. స్టేడియంలో డీజే నిర్వహణకు అనుమతి నిరాకరించడం ఆర్సీబీ యాజమాన్యానికి నచ్చడం లేదు. ఈ సమస్యలపై ఆర్సీబీ యాజమాన్యం, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (ఖాఅం)తో కలిసి ప్రభుత్వంతో చర్చలు జరపనుంది. ఒకవేళ ఇవి సఫలం కాకపోతే ఆర్సీబీ తన వేదికను మార్చుకునే అవకాశం ఉ ంది.రాజస్థాన్ రాయల్స్ జట్టుకు జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం హోమ్ గ్రౌండ్. అయితే ఇక్కడ సమస్య ప్రభుత్వం కాదు, క్రికెట్ అసోసియేషన్ పాలన. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌లో చాలా కాలంగా ఎన్నికలు జరగలేదు. ఈ పరిపాలనాపరమైన గందరగోళం వల్ల జైపూర్‌లో మ్యాచ్‌లు నిర్వహించడంపై బీసీసీఐ అసహనంతో ఉంది. జైపూర్‌లో పరిస్థితులు మెరుగుపడకపోతే, రాజస్థాన్ రాయల్స్ తమ హోమ్ మ్యాచ్‌ల కోసం జోధ్‌పూర్ లేదా ఇతర నగరాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి రావచ్చు.షెడ్యూల్ ఖరారు చేయాలంటే వేదికల విషయంలో స్పష్టత ఉండాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకే జనవరి 27 లోపు ఈ రెండు జట్లు తమ నిర్ణయాన్ని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు తెలియజేయాలని ఆదేశించింది. ఒకవేళ నిర్ణీత సమయంలోగా వేదికలు ఖరారు కాకపోతే, బీసీసీఐయే ప్రత్యామ్నాయ నగరాలను కేటాయించే అవకాశం ఉంది.

## విరాట్‌కు ఆ అవసరం లేదు.. కైఫ్ కీలక వ్యాఖ్యలు..

టీం ఇండియా 'కింగ్' విరాట్ కోహ్లీ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల జరిగిన న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో మూడు మ్యాచుల్లో 240 పరుగులు సాధించాడు. చివరి వన్డేలో 108 బంతుల్లో 124 పరుగులు చేసి జట్టును గెలిపించేందుకు కృషి చేశాడు. అయితే వన్డే జట్టులో చోటు దక్కాలంటే.. దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే అంటూ బిసిసిఐ విరాట్ వంటి సీనియర్ ప్లేయర్లకు కండీషన్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్నాడు. అయితే తాజాగా టీం ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ విరాట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదని కైఫ్ అన్నాడు. "విరాట్ లండన్ నుంచి వస్తున్నాడు.. పరుగులు సాధిస్తున్నాడు.. మళ్లీ వెళ్తున్నాడు. రెగ్యులర్‌గా ఆడకున్నా.. ఇలా నిలకడగా పరుగులు రాబట్టడం అంత తేలిక కాదు. అతడి ఫిట్‌నెస్, క్రికెట్‌పై అతడి అంకితభావం, స్వీయ సన్నద్ధత అద్భుతం. ప్రస్తుతం అతడు దేశవాళీ క్రికెట్‌లో ఆడాల్సిన అవసరం లేదు. మ్యాచ్ ప్రాక్టీస్ ఎవరైనా పొందుతారు. కానీ, ఆటపై అతడికున్న ఆ అభిరుచిని ఇతరులు పొందడం సాధ్యం కాదు. ఇది మార్కెట్‌లో దొరకదు. అతడు చివరి వన్డేలోనూ బ్యాట్‌తో అద్భుతంగా రాణించాడు" అని కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అన్నాడు.




## కోహ్లీని వెనక్కి నెట్టేసిన కివీస్ బ్యాటర్ .. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మిచెల్ టాప్



ముంబై : ఐసీసీ మెన్స్ వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానాన్ని ఆక్రమించేశాడు. తాజాగా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు చేసిన ఆ బ్యాటర్ .. విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టేశాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 9 సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 54 ఇన్నింగ్స్‌ల్లో అతను 9 సెంచరీలు కొట్టాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌లో మిచెల్ 352 రన్స్ స్కోరు చేశాడు. డారెల్ మిచెల్ 845 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 795 పాయింట్లతో కోహ్లీ రెండో స్థానంలో నిలిచాడు. వన్డే క్రికెట్‌లో మిచెల్ మొదటి ర్యాంక్ దక్కించుకోవడం ఇది రెండోసారి.

## అయోమయంలోనే ఉన్నాం.. టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేది డౌటే : బంగ్లా కెప్టెన్ లింటన్ దాస్




ఢాకా: వచ్చే నెలలో ప్రారంభంకానున్న టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేది డౌట్‌గానే ఉందని బంగ్లాదేశ్ కెప్టెన్ లింటన్ దాస్ అన్నారు. ఇండియాలో తాము ఆడబోమని బంగ్లా క్రికెట్ బోర్డు చెప్పడంతో.. ఆ దేశ ప్రాతినిధ్యంపై ప్రస్తుతం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆడుతున్న ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను బీసీసీఐ తప్పించింది. ఆ ఘటన తర్వాత ఇండియా వేదికగా జరిగే మ్యాచుల్లో తాము ఆడబోమని బంగ్లాదేశ్ చెప్పింది. దీంతో వరల్డ్‌కప్ వివాదం మరింత ముదిరిందివరల్డ్‌కప్ కోసం జట్టును ప్రకటించామని, కానీ తమ ఆడబోయే ప్రత్యర్థులు ఎవరు, ఏ దేశానికి వెళు న్నామని తెలిస్తే బాగుండేదని లింటన్ దాస్ అన్నాడు. తనలాగే యావత్ బంగ్లాదేశ్ అయోమయంలో ఉన్నట్లు పేర్కొన్నాడు. భారత్ వేదికగా జరగాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ అభ్యర్థించింది. కానీ ఐసీసీ మాత్రం ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నది. ఇండియాలో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరిస్తున్న విషయంపై ఆ దేశానికి మద్దతు ఇస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చెప్పింది. అయితే ఇవాళ జరిగే ఐసీసీ బోర్డు మీటింగ్‌లో బంగ్లా పాత్రపై నిర్ణయం తీసుకోనున్నారు.

## ఢిల్లీ చేతిలో ఓటమి.. ముంబై ప్లే ఆఫ్స్ చేరాలంటే..?

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. నాట్ సీవర్ బ్రంట్(45 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 65 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(33 బంతుల్లో 7 ఫోర్లతో 41) హాఫ్ సెంచరీ చేజార్చుకుంది. తెలుగు తేజం శ్రీచరణి(3/33) మూడు వికెట్లతో ముంబై పతనాన్ని శాసించింది.అనంతరం ఢిల్లీ 19 ఓవర్లలో 3 వికెట్లకు 155 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ జెమిమా(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించింది. లిజెల్లే లీ(28 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 46) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకుంది. ఈ ఓటమితో ముంబై ఇండియన్స్ తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది.డబ్ల్యూపీఎల్ రూల్స్ ప్రకారం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో టాప్-3లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచే జట్టు నేరుగా ఫైనల్ చేరనుండగా.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తోంది.ప్రస్తుతం 6 మ్యాచ్‌ల్లో రెండే విజయాలతో మెరుగైన రన్‌రేట్‌తో రెండో స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లకు రెండు గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రెండు మ్యాచ్‌లకు రెండు మెరుగైన రన్‌రేట్ విజయం సాధించాలి. అప్పటికీ ఇతర జట్లు అయిన యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల ఫలితాలపై ముంబై ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆధారపడాల్సి ఉంటుంది. తదుపరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి ఓడినా ముంబై పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది.ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరడం అసాధ్యం. ఎందుకంటే ముంబై తమ తదుపరి రెండు మ్యాచ్‌లు గెలిచినా 8 పాయింట్స్ వస్తాయి. ఇప్పటికే ఆర్‌సీబీ 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. చివరి రెండు మ్యాచ్‌లకు రెండు గెలిచి ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకొని ఎలిమినేటర్‌లో విజయం సాధిస్తేనే ముంబైకి ఫైనల్ బెర్త్ దక్కుతుంది.





# సినిమా



## నాగార్జున ఛాన్సిచ్చినా పెద్ద డైరెక్టర్ మోకాలడ్డాడు



ఒక్క ఐడియా జీవితాన్ని మార్చేస్తుందో లేదో తెలీదు కానీ, సినీపరిశ్రమలో ఒకే 'ఒక్క ఛాన్స్' చాలా మంది జీవితాలను మార్చేసిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు సందీప్ వంగా 'యానిమల్' చిత్రంలో అవకాశం చాలా మంది జీవితాలను మార్చేయడమే కాదు.. వారందరి పారితోషికాలు పెరగడానికి కారణమైంది. అయితే నటుడు, 'మనం సైతం' సేవా సంస్థ వ్యవస్థాపకుడు కాదంబరి కిరణ్ ని అలాంటి ఒకే ఒక్క ఛాన్స్ వరించినా కానీ దురదృష్ట దేవత తన నెత్తి మీద కూచుందని ఆవేదన చెందారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను చెబుతూనే, ఒకానొక దురదృష్టకరమైన విషయంపై కాదంబరి ఓపెనయ్యారు. తనకు దర్శకుడిగా నాగార్జున గారు అవకాశం ఇచ్చినా కానీ, ఒక పెద్ద దర్శకుడు ఆ అవకాశం కోల్పోవడానికి కారకుడయ్యాడని తెలిపారు. దాదాపు 16 మంది సినీపెద్దల సమక్షంలో నాగార్జున గారు నేను దర్శకత్వం వహించే సినిమాని ప్రకటించారు. అశ్వనిదత్, కేఎస్ రామారావు వంటి పెద్ద నిర్మాతలు అక్కడే ఉన్నారు. సినిమాని ప్రకటిస్తున్నాను.. నీ టైటిల్ ఏంటి? అని కాదంబరిని నాగార్జున ప్రశ్నించారు. 'బావ- ఏ లవబుల్ మ్యాన్'.. ఓన్లీ నాగార్జున అని చెప్పగానే, అందరూ క్లాప్స్ తో మెచ్చుకున్నారు. పోసాని కృష్ణ మురళి, జలదంకి సహా దాదాపు 20 మంది రచయితలు నాకు సహకారం అందించారు.. అని కూడా కాదంబరి తెలిపారు. కానీ నాకు ఫేట్ బాలేదు. ఆ సమయంలో అకారణంగా ఆ అవకాశం కోల్పోయానని కాదంబరి అన్నారు. అవకాశం వస్తే ఒకలా, కోల్పోతే ఇంకోలా పరిశ్రమలో మాట్లాడుకుంటారని కూడా కాదంబరి ఆవేదన చెందారు. అయితే నాగార్జునను దర్శకత్వం వహించే అవకాశం వచ్చినా, కథతో మెప్పించినా దానిని ఆపేసిన పెద్ద దర్శకుడు ఎవరు? అనేది మాత్రం కాదంబరి చెప్పనే లేదు. సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ ఉన్నా కూడా కొన్నిసార్లు సమీకరణాల వల్ల అవకాశాలు ఎలా చేజారిపోతాయో కాదంబరి వివరించారు. కాదంబరి కిరణ్ గురించి .. కాదంబరి సీనియర్ నటుడు... వందలాది తెలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా మెప్పించారు. 'మనం సైతం' అనే సంస్థ ద్వారా చిత్ర పరిశ్రమలోని పేద కార్మికులకు, అనారోగ్యంతో ఉన్నవారికి ఎంతో సహాయం అందిస్తున్నారు. ఇటీవల ఆయన పలు యూట్యూబ్ ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తూ ఇండస్ట్రీలోని తన అనుభవాలను చెబుతుంటే అవి ఆసక్తిని కలిగిస్తున్నాయి.

## వారణాసి.. ఆ డౌట్ ఇక అక్కర్లేదు!



: దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇండియన్ సినిమాలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ సినిమా చుట్టూ రోజుకో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ తిరుగుతోంది. గ్లోబ్ ట్రాటింగ్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ మూవీ విజువల్స్ ఎలా ఉండబోతున్నాయో అని అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పనులు చాలా కాలం పాటు సాగుతుంటాయి. దీనివల్ల సినిమాలు అనుకున్న సమయానికి థియేటర్లలోకి రావని చాలా మందిలో ఒక రకమైన కన్ఫ్యూజన్ ఉంటుంది. గతంలో 'ఆర్ఆర్ఆర్', 'బాహుబలి' సినిమాల విషయంలో కూడా రిలీజ్ డేట్స్ మారడం మనం చూశాం. అయితే మహేష్ బాబు సినిమా విషయంలో మాత్రం అలాంటి సందేహాలకు తావులేకుండా టీమ్ ముందే క్లారిటీ ఇస్తోంది.?ఈ క్రమంలోనే 'వారణాసి' అఫీషియల్ ఎక్స్ ఖాతాలో ఒక సరికొత్త అప్‌డేట్‌ను షేర్ చేశారు. గతంలో రిలీజ్ చేసిన కాన్సెప్ట్ గ్లింప్స్ విజువల్స్‌ను మరోసారి హైలెట్ చేస్తూ, ఈ సినిమా 2027లోనే వస్తుందని గట్టిగా చెప్పారు. అంటే సినిమా ఆలస్యం అవుతుందేమో అని భయపడే ఫ్యాన్స్‌కు జక్కన్న టీమ్ ఒక పక్కా క్లారిటీ ఇచ్చిందని చెప్పవచ్చు. గ్లోబల్ ట్రోటర్ ఈవెంట్ లో చెప్పినట్లే 2027 ఫిక్స్‌డ్ అని మళ్ళీ గుర్తు చేశారు. మహేష్ బాబు ఇందులో రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. సుమారు 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఐమాక్స్ ఫార్మాట్‌లో ఈ సినిమాను రాజమౌళి విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి ఇంటర్నేషనల్ స్టార్స్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఉండటంతో అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి. శ్రీరామ నవమి కానుకగా 2027 ఏప్రిల్ 9న ఈ సినిమాను విడుదల చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.?రాజమౌళి తన సినిమాల విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వరు కాబట్టి, ప్రతి ఫ్రేమ్‌ను చాలా పక్కాగా డిజైన్ చేస్తున్నారు. షూటింగ్ దశలోనే ఇంత క్రేజ్ సంపాదించుకున్న ఈ సినిమా రిలీజ్ టైమ్‌కి ఇంకెన్ని రికార్డులు బద్దలు కొడుతుందో చూడాలి. ఎప్పటికప్పుడు ఇలాంటి క్లారిటీ ఇవ్వడం వల్ల ఫ్యాన్స్‌లో ఉన్న కన్ఫ్యూజన్ తగ్గి, సినిమాపై మరింత పాజిటివ్ బజ్ క్రియేట్ అవుతోంది. జక్కన్న తన ప్లానింగ్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను కొల్లగొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ?ఇక 'వారణాసి' రిలీజ్ విషయంలో రాజమౌళి అండ్ టీమ్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు కనిపిస్తోంది. 2027లో ఈ సినిమా ఇండియన్ సినిమా సత్తాను ప్రపంచానికి మరోసారి చాటిచెప్పడం ఖాయం. మహేష్ బాబు మేకోవర్, ఆ గ్లోబల్ యాక్షన్ సీక్వెన్స్ వెండితెరపై ఎలా ఉంటాయో చూడాలంటే మరికొంత కాలం వెయిట్ చేయాల్సిందే.

## అప్పుడు వరుణ్‌తేజ్..ఇప్పుడు శర్వానంద్!

బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌లుగా నిలిచి సదరు హీరోల కెరీర్‌లని మలుపు తిప్పిన సినిమాలు ఇండస్ట్రీలో చిరస్థాయిగా నిలిచిపోయి చరగని ముద్ర వేస్తాయి. అలాంటి సినిమా టైటిల్స్‌ని మళ్లీ వాడాలంటే చాలా గట్స్ ఉండాలంటారు. కారణం ఆ ఐకానిక్ హిట్ తాలూకు ఇంపాక్ట్‌ని మళ్లీ కలిగించలేకపోతే ప్రేక్షకుల ఆదరణ లభించదు. ఫలితంగా సినిమా ఫ్లాప్ అవుతుంది. అంతే కాకుండా ఐకానిక్ హిట్ సినిమా టైటిల్‌ని, దానికున్న ఇమేజ్‌ని చెడగొట్టారనే చెడ్డపేరు మూటగట్టుకున్న వారవుతారు. అందుకే టాలీవుడ్‌లో చాలా మంది ఐకానిక్ హిట్ సినిమాల టైటిల్స్‌ని మళ్లీ వాడుకోవడానికి భయపడుతుంటారు.






అయితే కొంత మంది అభిమానం పేరుతో వాడుకుంటూ ఆ క్రేజ్‌ని క్యారీ చేయలేక బాక్సాఫీస్ వద్ద బోల్తాపడి పరాభవాల్ని ఎదుర్కొంటుంటే మర కొంత మంది హీరోలు మాత్రం చాలా పక్కాగా ప్లాన్ చేసుకుని ఐకానిక్ టైటిల్స్‌తో సినిమాలు చేస్తూ సక్సెస్‌లని దక్కించుకుని వాటికున్న గౌరవాన్ని, సెంటిమెంట్‌ని పెంచేస్తున్నారు. ఇలా ఎవర్ గ్రీన్ ఐకానిక్ టైటిల్స్‌ని మళ్లీ వాడి సూపర్ హిట్‌లని అందుకున్న హీరోలు అప్పుడు వరుణ్ తేజ్. ఇప్పుడు శర్వానంద్. పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఐకానిక్ హిట్‌లుగా నిలిచిన సినిమాలు 'తొలిప్రేమ', 'తమ్ముడు'. ఇందులో 'తమ్ముడు' టైటిల్‌ని నితిన్ రీసెంట్‌గా వాడి భారీ డిజాస్టర్‌ని దక్కించుకున్న విషయం తెలిసిందే. దిల్ రాజు నిర్మాణంలో వేణు శ్రీరామ్ తెరకెక్కించిన 'తమ్ముడు' భారీ అంచనాల మధ్య విడుదలై డిజాస్టర్ అనిపించుకుని నితిన్‌తో పాటు దిల్ రాజుకు ఊహించని షాక్ ఇచ్చింది. అభిమాన హీరో ఐకానిక్ టైటిల్ వాడి హిట్టు కొట్టలేకపోయానని హీరో నితిన్ కూడా ఫీలయ్యాడు. ఏం జరిగింది? అయితే పవన్ కెరీర్‌లో ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీగా నిలిచి తనకు భారీ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించిన 'తొలిప్రేమ' టైటిల్‌కు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ న్యాయం చేశాడు. తను హీరోగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన రొమాంటిక్ లవ్‌స్టోరీకి 'తొలిప్రేమ' టైటిల్‌ని తీసుకోవడం..అనుకున్నట్టే సూపర్ హిట్‌ని సొంతం చేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు ఇదే తరహాలో మరో ఐకానిక్ టైటిల్‌ని తీసుకుని హీరో శర్వానంద్ కూడా ఇదే ఫలితాన్ని దక్కించుకోవడం విశేషం. నందమూరి బాలకృష్ణ హీరోగా శోభన, నిరోష హీరోయిన్‌లుగా నటించిన మూవీ 'నారీ నారీ నడుమ మురారీ'.అప్పట్లో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమా టైటిల్‌ని తీసుకుని రొమాంటిక్ కామెడీ మూవీని చేశాడు. రామ్ అబ్బరాజ్ దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించగా సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్‌లుగా నటించారు.



## ఎన్టీఆర్ నీల్ మూవీకి సడన్ బ్రేక్.. ఏం జరిగింది?

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్టుల్లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ఒకటి. 'దేవర' లాంటి మాస్ సక్సెస్ తర్వాత ఎన్టీఆర్ చేస్తున్న ఈ సినిమాపై అంచనాలు హై రేంజ్ లోనే ఉన్నాయి. ఇప్పటికే రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నీల్ మార్క్ యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్న తరుణంలో ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ అంటే ఏ రేంజ్‌లో ఉంటుందో మనందరికీ తెలిసిందే. అందుకే ఎన్టీఆర్ కూడా ఎక్కడా తగ్గకుండా వరుసగా ఈ ఫైట్ సీన్స్‌లో పాల్గొంటున్నారు. అయితే గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఈ హెవీ షెడ్యూల్ వల్ల చిత్ర యూనిట్ అంతా చాలా బిజీగా గడుపుతోంది. కానీ లేటెస్ట్ గా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీనికి కారణం మరేదో కాదు, ఎన్టీఆర్ అనారోగ్యానికి గురవ్వడమే. గత రెండు రోజులుగా ఆయన జలుబు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వరుసగా యాక్షన్ సీన్స్ చేయడం వల్ల వచ్చిన అలసట, దానికి తోడు వాతావరణంలో మార్పుల వల్ల ఆయన హెల్త్ కొంచెం అప్సెట్ అయిందని సమాచారం. నటుడి ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని భావించిన ప్రశాంత్ నీల్ ప్రొడక్షన్ టీమ్, వెంటనే షూటింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించుకున్నారు. ఎన్టీఆర్‌కు కనీసం కొన్ని రోజుల పాటు పూర్తిస్థాయి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ప్రస్తుతం ఇంట్లోనే రెస్ట్ తీసుకుంటున్నారు. కోలుకున్న తర్వాతే మళ్ళీ కొత్త షెడ్యూల్‌ను ప్లాన్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ! నిజానికి ఈ షెడ్యూల్‌లో చాలా కీలకమైన ఘట్టాలను పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో ప్రతి ఫ్రేమ్‌ను చాలా పక్కాగా డిజైన్ చేస్తారు, అందుకే షూటింగ్ ఆగిపోవడం వల్ల షెడ్యూల్స్ కొంచెం అటు ఇటు అయ్యే ఛాన్స్ ఉంది. అయితే ఎన్టీఆర్ తన డెడికేషన్‌తో త్వరగానే కోలుకుని మళ్ళీ సెట్స్‌లోకి అడుగుపెడతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. సోషల్ మీడియాలో ఆయన త్వరగా కోలుకోవాలని మెసేజ్‌లు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీఆర్ నీల్ మూవీ అప్డేట్ వచ్చి చాలా కాలమైంది. ముఖ్యంగా సినిమా టైటిల్ డ్రాగన్ అని అనుకుంటున్నప్పటికి ఇంకా అఫీషియల్ గా క్లారిటీ ఇవ్వలేదు. ఇక అంతా అనుకున్నట్లు జరిగితే వచ్చే వారం నుండి మళ్ళీ కెమెరా ముందుకు ఎన్టీఆర్ వచ్చే అవకాశం ఉంది. హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**